అవనీ, ఆశ్చర్యంగా ఉందా నేను ఇలా ఉత్తరం రాయటం! ఏం చేయనూ...రాయకుండా ఉండలేకపోతున్నాను.

మా బామ్మ అన్నట్లుగా ( అపుడే మా నానమ్మని మీరు స్వంతం చేసేసుకున్నట్లుగా ' మా ' అంటున్నారే...అని కోప్పడకండి. కొందర్ని చూసీ చూడగానే స్వంతమనే భావన కలుగుతుందని తెలుసుకున్నాను! మీ ప్రమేయం లేకుండానే జరిగింది! అందుకే...మీ ఇంటికి తరచూ రావాలనే కోరిక బామ్మ మాటల కారణంగానే పెరిగిందనేదీ నిజమే!) మనస్సులోని మాటను చెప్పుకోవాలనే గిలి పెరిగిపోతూంటుంది ఒకోసారి. అదే ఈ తొలి ప్రేమలేఖకి కారణం!

మునుపు ఏదో ఇంత తిని పక్కమీదకు చేరి కాసేపు ఊహాలోకంలోకి వెళ్ళగానే ఎప్పుడు నిద్ర ఆవరించేదో తెలిసేదే కాదు ! కానీ ఇప్పుడో...నీ పరిచయం పెరిగాక నా సామ్రాజ్య విస్తీర్ణం పెరిగిపోయింది! అందుకే విహారానికి ఎంత సమయమూ చాలటంలేదు!

నిజం! నా ప్రపంచం రంగులమయమైపోయింది! ఎన్నెన్ని అందాలో! ఆనందంతో మనసు కోతిలా చెట్లమీదనుండి గెంతులు వేస్తోంది! గాలిపటంలా మారి ఆకాశమార్గానికి ఎగిరిపోతోంది! పిట్టలా మైమరచి పల్టీలు కొడుతోంది! అడవిలో పరుగుపెట్టే లేడిలా...నాట్యం చేసే మయూరిలా..ఇలా ఎన్నెన్ని రూపాల్ని సంతరించుకుంటోందో! ఎంత సందడి చేసేస్తోందో ! నిజం అవనీ..నాకేదో ఆనందాల గని దొరికినట్లే వుంది! నిశ్చయమైపోయాక ( పెద్దవాళ్ళ ద్వారా ఇంకా కాలేదనుకో..) పెళ్ళి వరకూ గడిచే రోజులన్నీ నిజంగా రాగరంజితాలే! పరిమళభరితాలే!

ఉత్తరం అందుకోవటంలో ఎంత ఆనందం ఉంటుందో...రాయటంలోనూ ఉంటూంది! అందుకే ఈ లేఖకి శ్రీకారం చుట్టానన్న మాట! ఆనందంగా రాస్తున్నా, అంతే ఆనందంగా అందుకోగల భాగ్యం కలిగిస్తావా? నేను మాత్రం నీకు ఎప్పటికీ ప్రేమలేఖలు రాస్తూనే ఉంటానని హామీ ఇస్తున్నాను! కేవలం కలంతోనే రాయనవసరం లేదు...

మనం కలిసి జీవించేటప్పుడూ చూపులతో, స్పర్శతో, చిరునవ్వులతో రాస్తూనే వుంటాను! అలా ఏ వయసులోనైనా, ఎప్పుడైనా, ఎన్నయినా రాసుకోవచ్చు! అవును కదూ? నిత్యమూ ఇలా...నాలో...మధురోహల సడే. తనువంతా తీయని అలజడే!

మీ ఇంట్లోకి అడుగుపెట్టినప్పుడు...ఏదో ఆత్మీయత వెల్లువై నన్ను ముంచెత్తినట్లుగా అనిపిస్తుంది! నేను పోగొట్టుకున్న నిధులన్నీ నిక్షేపంగా మళ్ళీ నా స్వంతమయ్యాయా అనే ఆశ్చర్యమూ కలుగుతోంది! ఈ ఊళ్ళోకి అడుగుపెట్టినప్పుడు నీ రూపంలో నన్ను ఇలా అదృష్టం వరిస్తుందని ఊహించలేదు!

అవును...అదృష్టమనేది వెతుక్కుంటే దొరికేదికాదు! సుకృతం ఉంటే, అదే సునాయాసంగా చేతికి చిక్కుతుందన్న మాట! నా విషయంలో ఇది రుజువైంది!

పంట చేతికి వస్తుందన్న ఆశతో పొలాన్ని సాగు చేస్తారు! ఎప్పటికీ ఫలితం లేకుండా సాగు మాత్రమే చేయలేంకదా ! అలాగే నేనూ నా ఊహల విహారానికి చుక్క పెట్టేసి చక్కనమ్మతో కలిసి చక్కర్లు కొట్టాలనే ఆశ కలుగుతోంది! మొన్నీమధ్య నా ఫ్రెండొకడు ' నీ రచనా వ్యాసంగం ఎంతవరకూ వచ్చిందీ ?' అనడిగాడు. " ఏదో సా...గుతోంది" అని చెప్పా. ఇప్పుడా మాట గుర్తొచ్చి నా రాత ( అంటే...ఈ ఉత్తరంలో ) ఇలా సా...గిందన్నమాట!

ఊహావిహారాలు బాగానే వున్నాయని ఎల్లకాలం వాటితోనే సరిపుచ్చుకోలేంకదా ! అందుకనే కాబోలు నా నడక చాలా నీరసంగా మారింది! మొన్నమొన్నటివరకూ ఎంతదూరమైనా పరుగు పెట్టెయ్యగలనని అనుకున్నానుగానీ అది నిజం కాదని తెలిసివచ్చింది! ఇలా నీరసంగా సా..గుతోన్న జీవితాన్ని నవరసభరితం చేయగల నెచ్చెలి అనుజ్ఞకోసమే ఈ ఆరాటమని అర్థం అవుతోందా అవనీ ?  నాకు ఉత్సాహాన్నీ, హుషారునీ నువ్వే ఇవ్వగలవు!

అందుకే అడుగుతున్నాను...ఎప్పుడు..ఎప్పుడు నీ చేయి పట్టుకోగలను ? ఎప్పుడు అడుగులు వేయగలను? ఎప్పుడు...మనమీద పెద్దల పూలజల్లులాంటి అక్షితలు కురుస్తాయి? చప్పున చెప్పాలి!

సంతకం అవసరం లేదుగా....

( ఇంకెవరు రాయగలరు ఇలాంటి ఉత్తరాన్ని..నీకు, నేనుగాక! )

చదవటం పూర్తి చేసి అవని ఆశ్చర్యానందాలతో కొన్ని క్షణాలు బొమ్మలా కూర్చుండిపోయింది. ఆఫీసునుండి బయలుదేరుతున్న సమయంలో కవరు చేతికి వచ్చింది.

ఉత్తరం తనకు రావటమనేది అరుదే. ఎవరో ఏ అప్లికేషనో చేతికి ఇవ్వకుండా పోస్టు ద్వారా పంపించారు కాబోలనుకుంటూ యధాలాపంగా తెరిచింది.

తనను తరచూ ఏదో పనిమీద కలుస్తూనే ఉంటాడు కాబట్టి సుభాష్ అయిఉంటాడనే ఆలోచన రాలేదు..ఎవరై ఉంటారూ అనుకుందే తప్ప!

చదివాక మాత్రం తీయని అనుభూతితో మైమరిచి కాసేపు కదలలేనట్లుగా కూర్చుండిపోయింది. సెల్ ఫోన్ తీసుకుని మెసేజ్ టైపు చేసింది.

" ఆశించకుండానే అద్భుతమైన కానుక చేతికి వచ్చింది! నా ఆనందాన్ని అక్షరాలలోకి అనువదించి ప్రత్యుత్తరమివ్వగలిగే నేర్పు, ఓర్పు కూడా నాకు లేవు! పెద్దవాళ్ళకూ తెలియజేసే సమయం వచ్చిందని అర్థమైంది. అలాగే చేద్దాం! ముందు ముందు మీరు రాసే లేఖలకి నేనూ ( కలం అవసరం లేకుండా ) అలాగే ప్రత్యుత్తరం ఇవ్వగలనని హామీ ఇస్తున్నాను"

దానికి కాసేపటికే సుభాష్ నుండి సెల్ ఫోన్ లో సమాధానం కనిపించింది.

" చిన్న ఉత్తరం అయితేనేం...నన్ను చిత్తు చేసేసింది! మత్తులోనూ ముంచేసింది! చిట్టి పొట్టి మాటలలోనే తేనెపట్టు తీయదనాన్ని అందించగల మీ నేర్పును అభినందిస్తూ, నేనూ నేర్చుకోగలగాలనుకుంటున్నాను "

పెదవులపైకి దూసుకొచ్చిన ముసిముసి నవ్వుల్ని అదిమిపెట్టే ప్రయత్నం చేసింది అవని.

సుభాష్..! ఈ పేరు మాటిమాటికీ అవని మనస్సులో మార్మోగుతూనే వుంటోంది! ఎంత విదిలించుకుంటున్నా, మనస్సును మరింతగా పట్టేసుకుంటోందేమిటి చెప్మా అని ఆశ్చర్యపోవటమూ మామూలయింది!

అవును! సుభాష్ తనకి పరిచయం కావటం కేవలం తన అదృష్టమే కాదు...ఊరంతటికీ కూడా అనుకోని వరమైంది!

సుభాష్ తలపెట్టే పనులన్నింటికీ పంచాయితీ సర్పంచ్ ప్రకాశం తోడయ్యాడు. అందుకే ఊరు అభివృద్ధి పథంలో పరుగుపెట్టింది!

ఏదో పత్రికకు రాయాల్సిన ఆర్టికల్స్ కి విషయసేకరణకు, భీమన్న విషయం న్యూస్ పేపరులో చదివి అభినందించటానికి వచ్చానని చెప్పిన సుభాష్ ఇక్కడే వుండి, ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టాడు! ఒకటా, రెండా..చాలా చాలా చేశాడు.

ఊరంతా కూడా సహకరించటంవలనే అభివృద్ధి ఇంత తొందరగా సాధ్యమైంది !

అవును...శుభ్రతేకాదు, అంతటా పరచుకున్న పచ్చదనం కనువిందు చేస్తూ ఇతర గ్రామాల ప్రజల ప్రశంసల్నీ అందుకుంది.

భీమన్న తలపెట్టిన జలయజ్ఞానికి సుభాష్ కూడా చేయి కలపటంతో ఊరంతా ఉత్సాహంతో ముందుకు ఉరికింది. భీమన్నను పిచ్చివాడిలా చూసినవాళ్ళే ఆ ప్రయత్నానికి సహకరించి మెచ్చుకున్నారు. అందరూ కలవటం వలనే తవ్వకం పూర్తయింది. నీటి కొరత తీరుతోంది!

రైతులంతా తమ పొలాల్లో కందకాలు, ఇంటిముందు ఇంకుడు గుంతలూ తవ్వారు. బారెడు పెరడున్నా సరే మొక్కల పెంపంకం సాగిస్తున్నారు.

ఉద్యోగాల అన్వేషణలో ఉన్నవాళ్ళు..వ్యవసాయం మీద మక్కువతో ఊళ్ళోనే ఉండిపోయిన వాళ్ళు..యువకులంతా నడుంకట్టి ఊరుని అన్ని విధాలా తీర్చిదిద్దారు! బృందాలుగా ఏర్పడి బాధ్యతల్ని స్వీకరించారు. సవాల్ అనుకుని సాధించారు!

మందు మహమ్మారిని తరిమికొట్టటానికీ, ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు ఏర్పరచటానికీ శ్రమించారు. అందరూ ఇది తమ ఊరు, తమ పనే అనుకోవటంవలనే ఊరు స్వరూపం మారి అందాలను సంతరించుకోగలిగింది!

స్కూల్ పిల్లల ఆటాపాటా కార్యక్రమానికి ఎంతమంది పెద్దలు సహకరించారో! మాష్టర్ల సహకారమూ తక్కువ కాదు...నిజానికి వాళ్ళదే ప్రధాన పాత్ర!

సుభాష్ వచ్చిన కొత్తలో ప్రతీ ఊరుకీ దేవాలయమే కాకుండా ఇంకో మూడు ఆలయాలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నాడు.

అలాగే ముందుగా ప్రభావతి పెద్దమ్మ వలన గ్రంథాలయం ప్రారంభమయింది! వైద్యాలయం కొద్దిరోజులలోనే ప్రారంభోత్సవం జరుపుకోనుంది. విద్యాలయం కూడా కళాశాలగా మారే ప్రయత్నమూ జరుగుతోంది! దీనికంతటికీ కారణం...ఒక్కడు...ఖచ్చితంగా సుభాషే !

అందర్నీ సమావేశపరిచి...ఎత్తులో నిలబడి ప్రసంగం ఇవ్వటం కాకుండా మధ్యలో కూర్చుని వాళ్ళలో ఒకడుగా అభిప్రాయలు సేకరించాడు. స్ఫూర్తి కలిగించాడు!

నిజంగా ఎన్నదగిన వ్యక్తి! అతని శ్రమ, సహనానికీ ఊరంతా తలవంచి అభివాదం చేస్తోంది! అలాంటి వ్యక్తి తన జీవిత సహచరుడు కావటం ఎంత అదృష్టం! దీనినే జన్మజన్మల పుణ్య ఫలం అంటారు కాబోలు !

అవని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి!

అవును...ఇక తాత్సారం చేయకూడదు. అతని వివరాలు రేపే కనుక్కుని ఇంట్లోవాళ్ళకి చెప్పాలి! అలా తీర్మానించుకున్న అవని తీయని కలల లోకంలోకి అడుగుపెట్టేసింది!

******

ఉదయమే ఇంట్లో ఏదో కలకలంలా వినిపించి అవని వంటగదిలోకి వచ్చింది.

వరాలు కంటిలోని నీటిని గమనించిన అవని హడావుడి పడుతూ వరాలు భుజాన్ని పట్టుకుని ఊపుతూ.." ఏమయిందీ..." అనడిగింది.

బదులు చెప్పకుండా మౌనంగా ఉండేసరికి అవనికి ఆదుర్దా ఇంకా పెరిగిపోయింది.

" చెప్పవేమిటీ...? అలా కళ్ళప్పగించి చూస్తావేం?" గదమాయించింది.

" సుభాష్ బాబు..." అంటూ నీళ్ళు నములుతూంటే అవనిలో ఆందోళన పెరిగి " చెప్పు....ఏమైందతనికి ...?" అంటూ నిలదీసింది.

" ఏమోనమ్మా...నాకు వివరం తెలీదు! ఊళ్ళో పుకారు...నమ్మే విషయంగా లేదు!" వరాలు మాటలకు అవనికి చిరాకు వచ్చింది.

" ఏదో ఒకటి నీకు తెలిసింది పూర్తిగా చెప్పకుండా అలా నాంచటం ఏమిటీ...వివరంగా చెప్పు.." గదమాయించినట్లుగా అంది.

వరాలు బిత్తరచూపులతో అక్కడే వున్న సుమతి, చిట్టెమ్మ, పార్వతమ్మలవైపు మార్చి మార్చి చూసింది. " ఏమిటోనే...నేనూ నమ్మలేకపోతున్నాను...ఇందులో ఏదో తిరకాసు ఉందనిపిస్తోంది. సుబ్బు మాత్రం మంచి ముత్యంలాంటివాడే! అని నా మనస్సు చెబుతోంది!" రుద్ధకంఠంతో చిట్టెమ్మ అంది.

" అవును...ఆ పూజారి కొడుకు కృష్ణశాస్త్రికీ ఈ వ్యవహారంతో సంబంధం ఉందంటున్నారు! తీగలాగితే డొంకంతా కదిలినట్లుగా అయింది వ్యవహారం! సుభాష్ కి క్లాస్ మేటో, స్నేహితుడోనట కృష్ణశాస్త్రీనూ. పూజ చేస్తూ అతను మంత్రోచ్చారణ చేస్తే మైమరపు వచ్చేది ! అంత చక్కగా పఠిస్తాడు. పండితులతోనూ చర్చించగలిగే సత్తా, విద్వత్తూ ఉన్నాయని అందరూ ఒకటే మెచ్చుకోలుగా మాట్లాడుకునేవారా...ఈ గుసగుస బయలుదేరినప్పటినుండీ అందరి స్వరాలూ మారిపోయాయి! పురాణానికి వచ్చినవాళ్ళు ఎక్కువసేపు కూర్చోకుండా ఇంటిదారి పట్టారు! " పార్వతమ్మ గట్టిగా నిట్టూర్చింది.

"అబ్బబ్బ! మీరందరూ విషయం చెప్పకుండా పిచ్చెక్కిస్తున్నారు...." విసుక్కుంటూ అవని ముందు గదిలోకి వచ్చింది. పేపరు తిరగేస్తున్న తండ్రి పక్కన కూర్చుని - " సుభాష్ గురించి నాన్నమ్మా, అమ్మమ్మా ఏదో అంటున్నారు. అర్థం కాకుండా మాట్లాడుతున్నారు. అసలు సంగతి ఏమిటీ ? ఏం జరిగిందీ ?" అనడిగింది.

ఆయనా పెద్దగా నిట్టూర్చాడు. " నిన్న సాయంకాలం రచ్చబండదగ్గరా ఇదే విషయం చర్చకు వచ్చింది. కొంతమంది మాత్రమే ' నిజమే అయ్యుంటుంది ' అని పెదవి విరుస్తున్నారు గానీ చాలామంది నమ్మలేమనే అంటున్నారు..."

" అదే వరాలు దేనిగురించి 'సుభాష్ గురించి అనుకుంటున్నారనీ అందేగానీ అదేమిటో చెప్పకుండా నీళ్ళు నములుతోంది ! అమ్మమ్మ గుడిలోకి వచ్చినవాళ్ళు మాట్లాడుకుంటున్నది చెప్పింది. ఇప్పుడు గుడిలో పూజాపునస్కార వ్యవహారమంతా మునుపటి పూజారిగారి కొడుకే చూస్తున్నాడుగా, అతను సుభాష్ కి స్నేహితుడట! అయితే ఏముందీ ఇందులో విడ్డూరం! వాళ్ళ మాటలకంటే...మీకు బాగా తెలిసిఉండాలే..! "

" అవును....నిన్న సాయంకాలమే ఇది విన్నా. నిజమో, నిందో తెలియకుండా దానిగురించి మాట్లాడితే, మనమూ ప్రచారానికి తోడ్పడినట్లవుతుందని మాట్లాడలేదు. గుడికి వెళ్ళొచ్చిన మీ అమ్మమ్మకి కొంత తెలిస్తే, పొద్దున్నే వరాలు మరికొంత సమాచారం మోసుకొచ్చింది!"

" అది సరే నాన్నా....ఇంతకీ జరిగిందేమిటీ అని! "

" అసలు విషయం ఏమై ఉంటుందో గానీ, నేను విన్నది మాత్రం.... విశాఖ ఏజెన్సీలో ఇతర రాష్ట్రాలవాళ్ళు కొంతమంది వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకుని గంజాయి సాగు చేస్తున్నారట! వాళ్ళతో...సుభాష్ కూ సంబంధం వుందనే వార్త వచ్చింది! "

పిడుగుపడినట్లుగా అవని అదిరిపడింది ! " అదేమిటీ...? " అవని గొంతు కీచుగా వచ్చింది.

" అదే అర్థం కావటంలేదు. సుభాష్ కూడా నిన్న ఊళ్ళో కనిపించలేదని అంటున్నారు. నిజానిజాలు అతనే చెప్పాలి ! "

" ఇక గుడిలో వ్యవహారం, కృష్ణశాస్త్రి, సుభాష్ కలిసే గుడిలో ఈ హోమాలూ, పూజలూ...అన్నిటికీ భారీగా రుసుములు వసూలు చేశారనే కబురూ గుప్పుమంటోంది! ఇదంతా నిజమని నేనైతే నమ్మటంలేదు. నిందలయితే, నిజాలేమిటో బయటకు రావాలి ! "

నిర్ఘాంతపోయి బొమ్మలా కూర్చున్న అవనిలో చలనం రావటానికి చాలా సమయమే పట్టింది.

" ఇది...ఎవరిద్వారా బయటకు వచ్చిందీ ? " తనలో తాను అనుకుంటున్నట్లుగా మెల్లగా గొణిగింది. మూర్తిగారు పేపరు మడిచి పక్కన పడేశారు.

" మొన్నీ మధ్యనే ' నిఘా నేత్ర ' ఏర్పాటయిందిగా, ఆ టీము వాళ్ళు...అందులో మన భగవాన్లుతో పాటూ తిరుగుతూంటాడే, ఆ కుర్రాడి పేరు...ఏమిటో గుర్తు రావడంలేదూ..."

" భరత్ నాన్నా.." అవని అందించింది.

" ఆ..ఆ భరత్...నారయ్యగారి కొడుకులిద్దరికీ నకిలీ విత్తనాల కంపెనీలో లావాదేవీలు ఉన్నట్టు కనిపెట్టి మందలించారట! నారయ్య కూడా కట్టుబాటు కాదని కృత్రిమ పద్ధతుల్లో పండ్లను మగ్గపెడుతున్నాడని బయటపెట్టారు. అందరిలో కూర్చోబెట్టి మందలించటంతో నారయ్య చిన్నబుచ్చుకున్నాడనీ అనుకున్నారు.

ఇప్పుడు ఏ ఉత్పత్తి అయినా మన ఊరికే వచ్చి కొనుగోలు చేసి వర్తకులంతా తీసుకెళ్తున్నారంట ! సరుకుకి మంచి పేరు వచ్చింది. మంచి ధరా వస్తోంది. రవాణా ఖర్చులూ తగ్గాయి. ఇదంతా సేంద్రియ వ్యవసాయంతో లభించిన పేరేగదా! దాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరో ఒకరిద్దరు పక్కదారి పట్టకుండా చూడాలికదా!

ఇక అలాంటి పనులు చేయమని కుటుంబం అంతా కలిసి మాట ఇచ్చారు. అది అలా పూర్తయిపోయిందనే అనుకున్నారు. నిన్న ఈ కబురు చెబుతూ నారయ్య ' ఊరునంతా శుభ్రంగా ఊడ్చిపారేస్తానంటున్న ఆ సుభాష్ బాబు వెనక ఉన్న చరిత్ర ఇదీ !' అని దూకుడుగా మాట్లాడాడు. నిజాన్ని తనే కనిపెట్టినట్లుగా తలెగరేశాడు!

గుడికి వచ్చే ఆదాయం అంతా ఏదో ట్రస్టుగా ఏర్పాటుచేశామని అన్నారు.

భగవాన్లు కూడా హాస్పిటల్ నిర్మాణ ఖర్చులన్నీ చూస్తున్నాడుగా, విరాళాల మీద వచ్చినదానికంటే ఎక్కువే అవుతోందని చెప్పినప్పుడు...అతనికి ఎక్కడినుండో వస్తోందేమోననుకున్నాం. కానీ...ఇప్పుడు తేలిందేమిటంటే...గుడికి వచ్చే ఆదాయన్ని దారి మళ్ళించి ఖర్చుపెడుతున్నాడట! ఇందులో కృష్ణశాస్త్రికీ, సుభాష్ కీ కూడా వాటాలున్నాయంటున్నారు.

ఇప్పుడేమో అందరూ ' సుభాష్ గుడికి వెళ్ళి ఎప్పుడూ దండం పెట్టుకోగా చూళ్ళేదుగానీ....కృష్ణశాస్త్రితో రహస్యంగా మంతనాలు చేయటం చూశామని ఒకరూ, ఇద్దరూ రైల్లో కలిసి ప్రయాణం చేస్తూండగా చూసామని మరొకరూ....' ఇలా చెప్పుకొస్తున్నారు! నిజానిజాలు భగవంతుడికే తెలియాలి! " అన్నారు.

" నాన్నా....ఇప్పుడు నాకూ గుర్తుకువస్తోంది. ఒకసారి..ఎవరో..పోలీస్ డిపార్టమెంట్ వాళ్ళే ఎస్.ఐ.నో మరొకరో తెలియదుగానీ....సుభాష్ తో మాట్లాడటం చూశాను. వాళ్ళు ఎక్కడో కాదు, భీమన్న ఇంటిముందు నిలబడి మాట్లాడుకున్నారు..! ఇప్పుడు వింటున్న విషయాలకీ, దానికీ ఏమైనా సంబంధం ఉందా..?"

అవనికి మతిపోయినట్లుగా వుంది. ఆనందంగా ఇంట్లోవాళ్ళకి సుభాష్ గురించి చెబుదామని నిర్ణయించుకున్న సమయంలోనే ఇలాంటి తుఫాను వచ్చిందేమిటో..!

సుభాష్ కూడా అందుబాటులో లేకుండా ఎక్కదికి వెళ్ళినట్లు ? అతనికీ దుమారం గురించి తెలుసునా...తెలియదా ? అర్థం కావటంలేదు.

అవని అక్కడినుండిలేచివచ్చేస్తుంటే తండ్రి " అవనీ..." అని పిలవటంతో ఆగిపోయింది.

ఏదో అడగటానికి తటపటాయించినట్లుగా ఒక క్షణం ఆగి, తర్వాత మళ్ళీ " ఏం లేదులే...వెళ్ళు" అనటంతో గదిలోకి వచ్చేసింది.

సుభాష్ గురించి తనకేమైనా సాంత్వన వచనాలు చెప్పాలనుకున్నారా ?

సుభాష్ దగ్గర్నుండి తనకి ఉత్తరం వచ్చిన ముందురోజు జరిగినది అపుడు గుర్తుకువచ్చింది. ఇంట్లో అడుగు పెట్టేసరికి అప్పటివరకూ మాట్లాడుకుంటున్నవాళ్ళు మాటలు ఆపేసి తనవేపు చిరునవ్వులతో చూశారు.

" ఏమిటీ...అందరూ ఇక్కడ సమావేశమై ఏదో చర్చిస్తున్నట్లున్నారు, ఇప్పుడు ఆపేశారేం?" అని తను అడిగింది.

" రోజూ ఈ వేళకి ఇక్కడ కూర్చుని టి.వి.చూస్తూంటాంగా, కొత్తగా అలా అడుగుతున్నావేం..? నాన్నమ్మ అంది.

ఆన్ చేసి లేని టి.వి.వేపు వేలు చూపించి " చూస్తున్నారా ? ' అనడిగింది.

" ఇప్పుడే ఆపేశాం. మంచి విషయం  మాట్లాడుకునేటప్పుడు ఆ గోల ఎందుకూ అనిపించింది! అందరూ సుభాష్ కి ఓటు వేశారు. మరి నీ సంగతి కనుక్కోవాలని అనుకుంటున్నాం!" తన వేపు మురిపెంగా చూసి నవ్వింది నాన్నమ్మ.

" దేనికీ...? అని తను అడిగిన ప్రశ్నకి నాన్నమ్మ తనని అనుకరిస్తూ " అబ్బో.." అంటూ నవ్వింది. " నీ గదిలోకి వెళ్ళి కూర్చుని తీరుబడిగా ఆలోచించు...అర్ధవవుతుంది! "

తనకీ అర్ధమైది గానీ తెలియనట్లుగా మొహం తిప్పుకుని గదిలోకి వచ్చేసింది.

తను అనుకున్నట్లుగానే సుభాష్ తో తన పెళ్ళి అభిప్రాయం ఇంట్లోవాళ్ళకీ వచ్చింది కాబోలు! అంతా సవ్యంగా సజావుగానే జరిగిపోతుందనే నమ్మకం కలిగింది!

అతని ఇంట్లోవాళ్ళు ఏమంటారో...అభ్యంతరాలేం లేవనెత్తరుకదా ! మాటల సందర్భంలో నైనా అతని వూరు, వివరాలు బయటపెట్టనేలేదు.

ఆ విషయం నానమ్మే చూసుకుంటానని అందికదా అనుకుంటూ స్థిమితపడింది అవని.

సుభాష్ గురించి ఇలాంటి వదంతి వచ్చింది కాబట్టి ఇక ఆ విషయంలో వెనక్కి వెళదామని నాన్నావాళ్ళు అనుకుంటున్నారా ? అదే అయివుంటూంది ! తమ మధ్య నిర్ణయం అయిందని వాళ్ళకి తెలియదుగా! ఇపుడు ఏమవుతుంది?

అవని సుభాష్ కి ఫోన్ చేసి " ఎక్కడున్నారు ?" అనడిగింది. మామూలుగానే మాట్లాడాలని అనుకుందిగానీ అనుకోకుండానే స్వరం కటువుగా మారింది.

" ఏదో తొందరగా, దూకుడుగా ఉన్నట్లున్నారే?"

" ఔను..అది నిజం! పొగలో చిక్కుకుని ఊపిరందనట్లుగా ఉక్కిరిబిక్కిరవుతున్నా!"

" నిజమా ? ఏమిటి విషయం ? పొగ సెగ అంటూ కాకుండా వివరంగా చెప్పండి..."

" ఇదేమిటి నన్నే అడుగుతున్నారు...మిమ్మల్ని అడిగి నేను వివరం తెలుసుకోవాలని అనుకుంటే...ఇలాంటి ప్రశ్నేమిటి ?"

" ఓ...ఊళ్ళో నా గురించి రేగిన పుకారు పొగేనా మిమ్మల్నీ ఊపిరాడకుండా చేస్తోందీ?"

" అవును. ఇప్పటికైనా అర్ధం అయిందిగా, ఇక ఇప్పుడు చెప్పండి. పుకారు అన్నారు కాబట్టి...నా ఆందోళన తగ్గింది. ఒకటి కాదు...ఒకేసారి రెండు నిందారోపణలు వచ్చాయి. నిజం కాదని నాకూ తెలుసుగానీ మీరూ ఆ మాట చెప్పండి"

" నిజంగానే ఒకటి నిజం కాదు. రెండోది మాత్రం అబద్ధం కాదు! " అతని స్వరంలో ఎటూవంటి తొట్రుపాటూలేదు. నిదానంగా మామూలుగానే మాట్లాడాడు.

అవనికి ఆశ్చర్యంగా ఉంది! అంటే...కృష్ణశాస్త్రితో కలిసి దేవాలయం సొమ్ములో లాలూచీ పడటం నిజమా? " మీరేదీ సరిగా చెప్పటంలేదు.." అవని స్వరంలో నిష్టూరం ధ్వనించింది.

"... ... ..."

" మాట్లాడరేం ?" రెట్టించింది. " మిమ్మల్ని కలిసి మాట్లాడాలి. ఊళ్ళోకి ఎప్పుడు వస్తున్నారు? ఎక్కడ వున్నారు? "

" పనిమీద వైజాగ్ వచ్చాను. రేపటివరకూ ఇక్కడే ఉంటాను. చెప్పండి...ఎక్కడ కలుద్దాం. మీ ఇంట్లో...వద్దు..."

" అయితే రేపు సాయంకాలం మీ ఫ్రెండ్ రెస్టారెంట్ కి వస్తాను. సరేనా ?"

" అలాగే, రేపు సాయంకాలం వరకూ నాకిక్కడే పనివుంది కాబట్టి ప్రాబ్లం ఏమీ లేదు!"

అవని ఫోన్ ఆపేసింది.

రేపటివరకూ ఈ ఉత్కంఠ భరించాల్సిందే..తప్పదు...అనుకుంది.

సాయంకాలం కాలేజినుండి ఇంటికి వచ్చిన చందూ దిగులుగా కూర్చోవటం చూసి అందరూ ఏం జరిగిందని అడిగితే...' ఏం లేదు.." అంటూ తప్పించుకున్నాడు.

ఫ్రెండ్స్ తో ఏదో తగాదా వచ్చి వుంటుందనే ఉద్దేశ్యంతో ఎవరూ తరిచి అడగలేదు. అవని వచ్చాక గదిలోకెళ్ళి చేతులు పట్టుకుని " అక్కా..." అంటూ బావురుమన్నాడు.

అవని కంగారుపడి భుజం చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకుని " ఏమైంది చందూ ?" అని లాలనగా అడిగింది.

కొంచెం స్థిమితపడి దుఃఖం  తగ్గించుకుని మెల్లగా విషయం వివరించాడు.

" అక్కా...ఒకసారి నేను కాలేజి నుండి వస్తున్నప్పుడు...ఎవరో వచ్చి ' సుభాష్ గారు నీకు తెలుసుకదా ' అనడిగితే తల వూపాను. లంచ్ బాక్స్ ఖాళీ అయివుంటూందిగా అని అడిగి తీసుకుని అందులో ఒక ప్లాస్టిక్ కవరు పెట్టి ' మీ ఇంటికి దగ్గరే కాబట్టి, ఊరుకు వెళ్ళినవెంటనే సుభాష్ కి ఇచ్చెయ్యి అని చెప్పారు.  దానికి అంత అలోచించాల్సిందేం లేదనిపించింది. సుభాష్ గారి గురించి మనకు బాగా తెలుసుగా..అందుకని సంకోచమే కలగలేదు.

ఆ రోజు వెళ్ళి ఆయనకి ఇచ్చినప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్లుగా తీసుకున్నారుగానీ, దాని గురించి ఏమీ చెప్పలేదు. నేనూ అడగలేదు. ఇప్పుడు..అంతా....అంటున్నారుగా...గంజాయి సాగు, అక్రమ రవాణా చేసేవాళ్ళతో సుభాష్ గారికీ ఏదో సంబంధం వుందని !

ఆ రోజు నేను చేరవేసింది గంజాయే అయివుంటూందని నాకిప్పుడు అనిపిస్తోంది! అక్కా....నేనూ కేసులో ఇరుక్కుంటానా..భయం వేస్తోంది! అమ్మావాళ్ళు అడిగితే ఏం చెప్పాలో తెలియట్లేదు ! నాకు నిజంగా ఏమీ తెలియదు కాబట్టి ఫర్వాలేదు అని  వదిలేస్తారా...లేక.." అంటూ మళ్ళీ కన్నీళ్ళు కార్చాడు. నిర్ఘాంతపోయిన అవని వెంటనే తేరుకుంది.

" మనం ఏ తప్పూ చేయనప్పుడు భయపడాల్సిన అవసరంలేదు.  నువ్వు మామూలుగా అయినా ఈ విషయం అప్పుడే చెప్పివుంటే ఆయన్ని నిలదీసి అడిగేవాళ్ళం..చిన్నపిల్లలకి..ఇలాంటి పనులు చెప్పటం ఏమిటీ...అని ! ఏమీ భయం లేదు....నీకేం జరిగినా మేమంతా పోరాడమా ? ఆ దిగులేం మనసులో పెట్టుకోకుండా నిశ్చింతగా ఉండు. నీ చదువు సంగతి నువ్వు చూసుకో!" అంటూ ధైర్యం చెప్పింది.

మళ్ళీ భుజం తట్టి " అసలేం జరగలేదనుకో. ఇందులో తనకేమీ ప్రమేయం లేదనీ, ఊళ్ళోవాళ్ళు అనుకుంటున్నది నిజంకాదనీ నాకు ఇందాకే చెప్పారు..." అని భరోసాగా చెప్పింది.

చందూ ధైర్యం తెచ్చుకున్నట్లుగా కనిపించేసరికి అప్పటికి అవని కూడా తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. కానీ రాత్రి చాలా సమయం వరకూ ఈ ఆలోచనలే వెంటాడాయి.

" సుభాష్ అంటే...నిజాయితీకి నిలువెత్తు రూపమని అనుకున్నానే...నిస్వార్ధానికి రుజువుగా మిమ్మల్ని చూపించవచ్చునని నమ్మానే !"

" ఏం మాట్లాడరేమిటీ...ఆ మౌనానికి అర్ధం ఏమిటి ?"

మీరంటే గిట్టనివాళ్ళెవరో ఇలా చేశారని అంటారా? ఈ ఊళ్ళో అలాంటి వాళ్ళు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు! అందరికీ మీరంటే అభిమానమే..గౌరవమే !"

" ఏం సమాధానం చెప్పకుండా మౌనంగా వుంటే సరిపోతుందని అనుకోకండి! నిజానిజాలు తేలాల్సిందే! "

సుభాష్ ని ఏ విధంగా నిలదీయాలోనని అవని మనసు అనేక ఆలోచనలు చేసింది ఇలా...ఛ ! అతను చెప్పేది వినకుండా నిందారోపణ చేయకూడదు...అని తనకు తనే సర్దిచెప్పుకుని నిద్రకు ఉపక్రమించింది.

******

" అవనీ...ఏదో అడగాలన్నారు...మాట్లాడరేం ? "

ఉత్తరంలో ఏకవచన ప్రయోగం చేసినవాడు..మళ్ళీ బహువచనం ఉపయోగిస్తున్నాడు. అంటే....దూరంగా జరగాలనే అభిప్రాయానికి వచ్చాడా...లేక యధాలాపంగా జరిగిందేనా?

" ఏం మాట్లాడకుండా...అలా చురచుర చూస్తే ఎలా...?"

" ... ... ..."

" మౌనేన కలహం నాస్తి అంటారుగానీ...అది కొన్ని సమయాల్లో మాత్రమే కరెక్టు! మన మధ్య పోట్లాట వచ్చినా ఫరవాలేదుగానీ....ఏదో ఒకటి మాట్లాడండి. మాటల వారధి ఉంటేనే మనసు తెలుసుకోగలుగుతాం! అవునా ?"

" అయితే ...మీ మనసులోని ఆ మాయా మర్మం గుట్టు ఏమిటో విప్పండి...వింటాను!"

సుభాష్ పెదవులపైకి చిన్న చిరునవ్వు వచ్చింది.

అవని ఆశ్చర్యంగా చూసిందతనివేపు.

" ఎలా...ఎలా...అంత నిశ్చింతగా నవ్వగలుగుతున్నాడు? నిజంగా నింద అయినా భరించాల్సిరావటం భారమేగా ?"

ఆశ్చర్యాన్ని అదిమిపెట్టి కొంచెం ఆవేశంగా అదే అడిగింది.

******